దూరమైన అటవీశాఖ సేవలు

- డోర్నకల్‌నుంచి మహబూబాబాద్ కార్యాలయానికి తరలింపు
- పెరిగిన కలప అక్రమ రవాణా

డోర్నకల్: డోర్నకల్ నుంచి మహబూబాబాద్‌కు అటవీశాఖను తరలించడంతో డోర్నకల్ ప్రాంతం అటవీశాఖ సేవలకు దూరమైంది. అటవీ సంపద రక్షణ, చెట్ల పెంపకం, శాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2016 అక్టోబర్ 12న నెలలో డోర్నకల్‌లో అటవీశాఖ డోర్నకల్ రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. డోర్నకల్ రేంజి పరిధిలో డోర్నకల్, కురవి, మరిపెడ సెక్షన్లను ఏర్పాటు చేశారు. డోర్నకల్ రేంజి పరిధిలో ముగ్గురు సెక్షన్ అధికారులు, ఆరుగురు బీట్ అధికారులతోపాటు జూనియర్ అసిస్టెంట్, డ్రైవర్‌తోపాటు మరో పోస్టుకు ఉద్యోగులను నియమించి పాతడోర్నకల్‌లోని అద్దె భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. డోర్నకల్ రేంజి పరిధిలో కురవి సెక్షన్‌లోని కందికొండ గుట్ట పరిసరాల్లో 200హెక్టార్ల అటవీ భూములు మాత్రమే ఉండగా డోర్నకల్, మరిపెడ సెక్షన్లలో అటవీ భూములు లేకపోవడంతో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేయడంతోపాటు రోడ్ల పక్కన మొక్కలను నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అటవీ సంపద రక్షణ, మొక్కల పెంపకంపై గ్రామాల్లో అనేక అవగాహన సదస్సులు నిర్వహించారు. కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తరువాత ఒక్కొక్కరుగా సిబ్బంది బదిలీ కావడం, అద్దె భవనంలో కార్యాలయం నిర్వహించడం ఇబ్బందికరంగా మారడంతో ఇతర నిర్వహణ ఖర్చులు పెరగడంతో రెండేళ్ల క్రితం కార్యాలయాన్ని డోర్నకల్ నుంచి మహబూబాబాద్ పాత డీఎఫ్ఓ కార్యాలయంకు తరలించారు.


తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభమైన రేంజ్ కార్యాలయం (ఫైల్)


ప్రస్తుతం మహబూబాబాద్ పాత డీఎఫ్ఓ కార్యాలయంలో రేంజ్ ఆఫీసు

అక్రమంగా కలప తరలింపు..

డోర్నకల్ నుంచి అటవీశాఖ కార్యాలయాన్ని మహబూబాబాద్‌కు తరలించడంతో రెండేళ్లుగా నిఘా లేక జిల్లా సరిహద్దులో కలప అక్రమ రవాణా పెరిగింది. డోర్నకల్, ముల్కలపల్లి, తొడేళ్లగూడెం, వెన్నారం తోపాటు ఇతర మండలాల నుంచి ఖమ్మంకు పెద్ద ఎత్తున సంద్ర, టేకు, వేప, నెమిలినారి లాంటి అటవీ సంపద గుట్టుగా తరలిపోతోంది. కొంతమంది నామమాత్ర అనుమతులతో వేప, సంద్ర కలపను ఖమ్మంకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డోర్నకల్ మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల పట్టా భూముల్లో పెరిగిన సంద్రను దళారులు కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లా చింతకానిలో పట్టుబడిన కలప డోర్నకల్ ప్రాంతం నుంచి తరలించారని అధికారులు గుర్తించడంతో నిఘా కొరవడటంతోనే కలప అక్రమ రవాణా జరుగుతుందని తేలింది.

సిబ్బంది కొరత..

ప్రస్తుతం మహబూబాబాద్ పాత డీఎఫ్ఓ కార్యాలయంలో కొనసాగుతున్న డోర్నకల్ రేంజి కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం రేంజి అధికారిగా రేణుక విధులు నిర్వహిస్తుండగా ముగ్గురు సెక్షన్ అధికారులకు ఇద్దరు ఉండగా ఆరుగురు బీట్ ఆఫీసర్లు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. సిబ్బంది కొరత, నిఘా లేకపోవడంతో అధికారులు ఫోన్ సమాచారంపై ఆధార పడుతున్నారు. డోర్నకల్‌లో రేంజి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కురవి: గ్రామ పంచాయతీల్లో పనిచేసే వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జీపీ వర్కర్స్ యూనియన్ మండల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర 5వ మహాసభలను గార్ల మండల కేంద్రంలో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీల్లో కార్మికులు మల్టీపర్పస్ వర్కర్ విధానంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఆదివారం, పండుగల్లో సెలువులు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నలమాస లచ్చన్న, అశోక్, రమేష్, సోందు, విష్ణు, శ్రీను, స్వామి, సాగర్, ఉపేందర్, అప్పయ్య, ఉమేష్, నాగయ్య, శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుంట ఉపేందర్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

పెద్దవంగర: ఇందిరమ్మ ఇల్లు కల సాకారం అవుతుండగా, చిన్న అడ్డంకి పెద్ద సమస్యగా మారింది. విద్యుత్ స్తంభం కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మైలపాక యాకమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం పునాదికి ఆనుకొని ఉండడంతో గోడల నిర్మాణం, స్లాబ్ వేసే పనులు జరిగే క్రమంలో ప్రమాద భయం నెలకొంది. ఈనేపథ్యంలో యాకమ్మ విద్యుత్ శాఖ అధికారులను వేడుకొంటూ, స్తంభాన్ని పక్కకు మార్చి ఇంటి నిర్మాణానికి సహకరించవలసిందిగా అభ్యర్థిస్తుంది. ఇదే బజారులో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. అటుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. విద్యుత్ అధికారులు ప్రమాదాలు జరగకుండా స్తంభాలను మరోచోటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.


పునాదికి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం


పోచంపల్లిలో సీసీ రోడ్డు మధ్యలో స్తంభం

ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతాం

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ సారథిరెడ్డి

మహబూబాబాద్ రూరల్ : టైం స్కేల్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి అన్నారు. మండలంలోని మల్యాల హెచ్‌ఆర్‌ఎస్ టైం స్కేల్ ఉద్యోగస్తులు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ.. టైం స్కేల్ ఉద్యోగస్తులకు రిటైర్డ్ బెనిఫిట్ రూ.7.50లక్షలకు పెంచాలని, పదవీ విరమణ వయసు 61ఏళ్ల వరకు పెంచాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 16, 17వ తేదీల్లో ఆందోళన చేపట్టి, 24న చలో సిద్దిపేట కొండ బాపూజీ లక్ష్మణ్ యూనివర్సిటీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, బానోత్ లింగ్యానాయక్, జలగం ప్రవీణ్, అమీర్, శ్రీరాములు, హుస్సేన్, ఇమామ్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్ సారథిరెడ్డి

వైద్యశిబిరం

మహబూబాబాద్ అర్బన్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్‌క్లబ్ పిలుపు మేరకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ దేవిరెడ్డి, వీరన్న, క్లబ్ సెక్రటరీ పర్కాల రవీందర్‌రెడ్డి, బవిరిశెట్టి నాగేశ్వర్ రావు, చొడవరపు సుధాకర్, పారుపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.

నివాళి

చిన్నగూడూరు: మండలానికి చెందిన ప్రముఖ జర్నలిస్టులు గాడిపల్లి మధు, శ్రీహరి, యాదగిరి, శేఖర్‌ల మాతృమూర్తి గాడిపెల్లి దేవకమ్మ (87) అకాల మరణం చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్ ఆదివారం ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్త వహించాలి

కేసముద్రం: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తలు వహించాలని ఏడీఈ మచ్చ ఐలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని అన్నారం, పెనుగొండ గ్రామంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ బావుల వద్ద స్టార్టర్‌లకు, మోటార్లకు ఎర్తింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధుడు కొమురం భీం

గూడూరు: ఆదివాసుల హక్కుల కోసం జల్ జంగిల్ జమీన్ నినాదంతో నైజాంకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురం భీం అని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కొమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పడిగె నాగేశ్వర్‌రావు, బొల్లి సారయ్య, ముయ్యబోయిన వెంకన్న, లింగాల కిరణ్, జక్క లక్ష్మయ్య, రేగ రమేష్ పాల్గొన్నారు.

బయ్యారం: కొమురం భీం వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ఆదివారం బయ్యారంలోని ఆయన విగ్రహం వద్ద తుడుందెబ్బ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈసం నరసింహారావు, నాయకులు కోటయ్య, పద్మ, నర్సింగరావు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.


గూడూరు: నివాళులర్పిస్తున్న ఆదివాసులు

దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న కోండ్ర ఎల్లయ్య

నెహ్రూసెంటర్: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ముఖ్యనేతల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజేఐపై దాడిని ఎంఆర్‌పీఎస్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత వ్యక్తి అత్యున్నత పదవిలో కొనసాగుతుంటే జీర్ణించుకోలే కొంత మంది సీజేఐపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దాడికి యత్నించి వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పులి శ్రీను, దేవి, ఉపేందర్, బాలకృష్ణ, సందీప్, రాధా, సుధా, ఎల్లయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న బద్రి

గూడూరు: గూడూరు మండలాన్ని ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మూతి బద్రి కోరారు. మండల కేంద్రంలోని కొమురం భీం నగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గూడూరు తాలూకా కేంద్రంగా, సమితిగా ఉండేదన్నారు. ఇప్పుడు గూడూరు, కొత్తగూడ, గంగారం, గార్ల, బయ్యారం ఏజెన్సీ ఆదివాసీ మండలాలను కలుపుతూ లిమిటేషన్‌లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐలబోయిన వీరయ్య, పెనుక ప్రభాకర్, బత్తుల శ్రీనివాస్, ముయ్యబోయిన వెంకన్న, మద్దెల రమేష్, కాక నర్సయ్య, ఐలబోయిన సమ్మక్క పాల్గొన్నారు.

కాళోజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

మహబూబాబాద్ రూరల్: కాళోజీ నారాయణరావు స్ఫూర్తితో సామాజిక అభివృద్ధికి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, గౌరవ సలహాదారు మైస నాగయ్య పిలుపునిచ్చారు. అసోసియేషన్ వార్షిక సమావేశం మండలంలోని కంబాలపల్లి చెరువు వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ వార్షిక నివేదికను ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, ఆర్థిక నివేదికను కోశాధికారి సోమ విష్ణువర్ధన్ ప్రవేశపెట్టారు. అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సత్యనారాయణ, నాగయ్య హాజరై మాట్లాడుతూ.. కాళోజీ వాకర్ అసోసియేషన్ 2012లో ప్రారంభించామని, 2015లో రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధితోపాటు, అనేక సామాజిక, ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ వాకర్స్ అసోసియేషన్‌గా ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుందని వివరించారు. కార్యక్రమంలో గూడూరు నాగేశ్వరరావు, కునుసోతు హట్యానాయక్, పెద్ది వెంకన్న, కోట సుధాకర్, ఆరుద్ర పరమాత్మ చారి, ఏసీజీఈ మందుల శ్రీరాములు, వెంకన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

18న బంద్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

గార్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో జరిగిన బీసీ సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ మండలాల్లో గతంలో మాదిరిగా బీసీలకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించేంత వరకు బీసీ సంఘాలు సమన్వయంతో ఉద్యమించాలని కోరారు. బీసీ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఈనెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సూత్రపు రాజుయాదవ్, శీలంశెట్టి రమేష్, వజ్రం నాగేశ్వరరావు, కోట ఉత్తరయ్య, తాళ్లూరి శ్రీనివాస్, విద్యాసాగర్, రమేష్, రామారావు, క్రాంతి, నాగరాజు, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

గార్ల: గత రెండేళ్ల నుంచి రూ.220 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో 26వేల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ వెంకన్న, బి.హరినాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన పేద విద్యార్థులకు 25 సంవత్సరాల క్రితం నాటి ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీంను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎంపిక చేసిన 230 ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఆరునెలలకు ఒకసారి పేద విద్యార్థుల కోసం ప్రైవేట్ పాఠశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి బకాయిలు చెల్లించక పోవడంతో పాఠశాలల యాజమాన్యం పేద విద్యార్థులను ఇళ్లకు పంపించిందన్నారు.

కురవి: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 26వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రోడ్డున పడ్డారని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యకు దూరమవుతున్నారని వెంటనే బకాయి నిధులు విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా పాస్టర్స్ డే

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి ఎన్టీఆర్ నగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో విట్నెస్ ఆఫ్ ట్రూ లైట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ పిల్లి కుమారస్వామి, సరిత దంపతులను, సీనియర్ పాస్టర్ పిల్లి ముత్తయి జీవమ్మలను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాసరి యాకాంబ్రం, పిల్లి రాము, ప్రశాంత్, సంతోష్, వెంకట్రాంనర్సయ్య, అనసూయ, సౌజన్య, సౌందర్య, పావని, స్వాతి, స్వరూప, కొమురమ్మ పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

గూడూరు: మండల కేంద్రంలోని అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముయ్యబోయిన వెంకన్న, ప్రధాన కార్యదర్శి ముక్తవరం సత్యనారాయణ, కోశాధికారి బత్తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మండల వెంకటేశ్వర్లు, ఊకె లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి నూనావత్ వీరన్న, క్రీడా కార్యదర్శి పెనుక ప్రభాకర్, ప్రచార కార్యదర్శి వాంకుడోతు గోపీనాథ్, గౌరవ అధ్యక్షులుగా ఎండి. ఖాసీం, వాంకుడోతు కొమ్మాలు, సలహాదారులుగా మరో 10 మందిని ఎన్నుకున్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి హరిహర గార్డెన్స్‌లో నిర్వహించిన సంఘం 5వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉప్పలయ్య, మోడెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, సంపత్, సహాయ కార్యదర్శి రవీందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, చిలువేరు సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కురవి: మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని బలపాల లింగ్యాతండా మాజీ సర్పంచ్ గుగులోత్ రాంలాల్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేయించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వడ్డీలు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. పదవీ కాలం ముగిసినప్పటికీ బిల్లులు ఇవ్వడంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కేసముద్రం: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని భుక్యారాంతండాజీపీలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు వెంకన్న (37) అనే వ్యక్తి, గత కొంతకాలంగా మద్యానికి బానిసై, పలుచోట్ల అప్పులు చేస్తూ మద్యం తాగేవాడు. దీంతో అప్పులు ఎక్కువకావడంతో, తన వ్యవసాయ భూమి వద్ద గడ్డిమందు తాగాడు. వెంటనే మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తండ్రి తేజ్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు ఇళ్లు అందించకపోవడం సరికాదు

తొర్రూరు: పేదలకు ఇళ్లు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్ అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిరసన కార్యక్రమాలు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, పార్టీ నాయకులు డొనుక దర్గయ్య, జమ్ముల శ్రీనివాస్, మార్క సాంబయ్య, స్థానికులు పాల్గొన్నారు.


బాలికకు వేధింపులు?

కురవి: జిల్లాలోని ఓ గ్రామంలో మైనర్ బాలికను ఓ యువకుడు వేధింపులకు గురి చేసిన సంఘటన ఆలస్యంగా ఆదివారం తెలిసింది. తెలిసిన సమాచారం మేరకు జిల్లాలోని ఓ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మరో తండాలో బాలికను అదే తండాకు చెందిన ఓ యువకుడు కొన్ని రోజుల నుంచి వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ఈవిషయమై బాలిక తల్లిదండ్రులు పెద్దలను ఆశ్రయించగా పంచాయతీ నిర్వహించి ఆ యువకుడు మరోసారి ఆమె జోలికి రాకుండా తీర్మానించినట్లు తెలిసింది. ఇదే విషయమై ఆ మండల పోలీసులను వివరణ కోరగా ఎలాంటి విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

బీసీలను మోసగిస్తున్న పార్టీలు

తొర్రూరు: బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పించకుండా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు అడ్డుపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు ఊడుగుల రాములు, జక్కుల యాకయ్య, సెగ్యం యాకయ్య, చింత నవీన్, వెంకన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


సతీశ్ (ఫైల్)

పెద్దవంగర : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పార్ల సతీశ్ (29), మమత దంపతులు రోజువారీ కూలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు వర్షిత, హర్షిత ఉన్నారు. ఈ క్రమంలో సతీశ్ మద్యానికి బానిసై రెండేళ్లుగా పనికి వెళ్లడం లేదు. దీంతో కుటుంబం గడవకపోవడంతో భార్య పనికి వెళ్లాలని చెప్పింది. అయినా సతీశ్ వినకపోవడంతో తన ఇద్దరు పిలలను తీసుకుని వెళ్లి తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. దీనిపై కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్న సతీశ్ శనివారం ఉదయం తన తల్లి కూలీ పనికి వెళ్లగా మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడ్డు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై హిదాయత్ అలీ తెలిపారు. కాగా, సతీశ్ మృతదేహానికి పెద్ద కూతురు వర్షిత తలకొరివి పెట్టింది. ఈ దృశ్యం అందరి హృదయాలను కలచివేసింది. దహన సంస్కారాలకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపించిన రూ. 10 వేలను కాంగ్రెస్ నాయకుడు సంకెపల్లి రవీందర్ రెడ్డి.. బాధిత కుటుంబానికి అందజేశారు.

క్లుప్తంగా

ఎంపీ చిత్రపటానికి పాలాభిషేకం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో రైల్వే మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బానోత్ సిద్దు నాయక్ అన్నారు. డిపో మంజూరును హర్షిస్తూ ఎంపీ పోరిక బలరాంనాయక్ చిత్రపటానికి ఆదివారం స్థానిక వివేకానంద సెంటర్‌లో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన నాయకులు పింద్రాల రామదాసు, తోకల సందీప్ రెడ్డి, తవిశెట్టి రాకేష్, శ్రీరామ్ విక్రమ్, మనోజ్ గౌడ్, షాకుల అజయ్, సయ్యద్ పాషా పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బయ్యారం: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మాస్‌లైన్ జిల్లా నాయకులు జగ్గన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని బయ్యారం, గంగారం, కొత్తగూడ, గార్ల, గూడూరు, మహబూబాబాద్, కేసముద్రం మండలాల పరిధిలో వానాకాలంలో మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేశారన్నారు. సాగు చేసిన పంట కోతకు వచ్చిన సమయంలో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కన్న తక్కువ ధరకు మొక్కలు కొనుగోలు చేయటం వలన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధర రావడం వల్ల ఆర్థికంగా ఆసరా అవుతుందన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



దంతాలపల్లి: మండలం వేములపల్లి గ్రామానికి చెందిన గుండాగాని శివాంశిక జాతీయస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన 15 సంవత్సరాల విభాగంలో శివాంశిక ప్రతిభ కనబర్చింది. నవంబర్ 1నుంచి 10వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ఆమె పాల్గొననున్నారు. తల్లిదండ్రులు సతీష్, భవానితోపాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలో దంచికొట్టిన వర్షం

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి ఎండ అధికంగా కొట్టి సాయంత్రం నుంచి ఒక్కసారిగా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆకాలంగా కురిసిన వర్షానికి రైతుల పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిలే అవకాశాలు ఉన్నాయి.

స్వామివారికి వెండి ఆభరణాల బహూకరణ



గార్ల: కోరుకున్న వారికి కొంగు బంగారం కోర్కెలు నెరవేర్చే వేంకటేశ్వరస్వామికి ఆదివారం అట్లూరి వీరరాఘవ రాయచౌదరి, గౌతమి దంపతులు 132గ్రాముల వెండి ఆభరణాలు (బంగారంపూతతో) మద్రిగూడెం దేవాలయంలో అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట శివారు ముక్త్యాల గ్రామవాసి అట్లూరి వీరరాఘవ రాయచౌదరి తన కోర్కెలు నెవవేరడంతో స్వామివారికి వెండి ఆభరణాలు అందజేశారు.

ఆర్థికసాయం

డోర్నకల్: బాల్య మిత్రుడి అకాల మరణంతో స్పందించిన మిత్రులు ఆర్థికసాయం అందించారు. వెన్నారం గ్రామానికి చెందిన కొండా రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాల్యమిత్రులు రూ.30వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎడ్ల మల్లేష్, గొల్లమందల కృష్ణ, రిమీరవు, కొమ్ము రమేష్, దాసరి కాంతారావు, చుక్క బాబు, రామారావు, రాంబాబు, కమలాకర్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన బావి జలాలు



కురవి: అధిక వర్షాలతో భూగర్భ జలాలు ఉప్పొంగిపోతున్నాయి. మండలంలోని తిర్మలాపురం గ్రామంలో కల్లెపు వీరన్న అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలోని నీరు ఉప్పొంగి అలుగుపోసే స్థితిలో ఉన్నాయి. చేతులతో నీళ్లను తీసుకునేలా గంగమ్మ పైకి లేచింది. బావిలోని జలాలు ఉప్పొంగి పోవడంతో రైతు వీరన్న ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.